క్లుప్తంగా

శ్రీవారి భక్తుల అన్నదానానికి బియ్యం విరాళం



బియ్యం బస్తా అందజేస్తున్న డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న శ్రీవారి భక్తుల అన్నదాన కార్యక్రమానికి గురువారం డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి బియ్యం అందజేశారు. తొలుత శ్రీవేంకటేశ్వర స్వామికి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

రైతులు నష్టపరిహారం అందుకోవాలి

తవణంపల్లె: మండలంలోని పట్నం రెవెన్యూ గ్రామ లెక్కల దాఖలాలో ఆరు లేన్ల రహదారి ఏర్పాటు కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములకు ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసిందని తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, భూ రీసర్వే డీటీ వెంకటరమణ తెలిపారు. పట్నం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబరు 423/9బిలో 121.41 చదరపు మీటర్లు, సర్వే నంబరు 1075/12లో 9.13 చదరపు మీటర్లు, సర్వే నంబరు 1099/22లో 607.05 చదరపు మీటర్ల భూమిని రైతుల నుంచి స్వాధీనం చేసుకొన్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ భూములకు సంబంధించి రికార్డులను తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి నష్టపరిహారం తీసుకోవాలని కోరారు.

అర్ధగిరిలో శ్రీకాళహస్తి ట్రస్టుబోర్డు చైర్మన్



అర్ధగిరిలో అంజూరు తారక శ్రీనివాసులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామిని గురువారం సాయంత్రం శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తమ కుటుంబ సభ్యులతో దర్శించుకొన్నారు. ఆయనకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

గురజాడ రచనలు మరువలేం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపల్ మనోహర్

చిత్తూరు కలెక్టరేట్: గురజాడ అప్పారావు రచనలు మరువలేమని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. ఆ కళాశాలలో గురజాడ అప్పారావు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గురజాడ రచనలతో సమాజాన్ని పట్టిపీడిస్తున్న బాల్యవివాహాలు, కన్యాశుల్కం వంటి దురాచారాలను రూపుమాపినట్లు గుర్తుచేశారు. సంఘ సంస్కర్తగా తనలోని మానవతను చాటుకున్నారని తెలిపారు. తెలుగు లెక్చరర్ ఉషారాణి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, డిప్యూటీ కలెక్టర్ ఆఫీసులో హెడ్‌క్లర్క్‌గా, విజయనగరం రాజు ఆస్థానంలో అధ్యాపకుడిగా పనిచేశారన్నారు. అనంతరం ఆ కళాశాల విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు లెక్చరర్ ధర్మమూర్తి పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయ పనుల పరిశీలన



నూతన ఆర్డీవో కార్యాలయం పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో రేణుక

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో అధునాతన హంగులతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆర్డీవో కార్యాలయం పనులను ఆర్డీవో రేణుక పరిశీలించారు. చివరి దశలో ఉన్న పనులను గురువారం ఆర్డీవో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా నూతన కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయం ఏవో రామాంజులు నాయక్, వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షులు బాలాజీరెడ్డి పాల్గొన్నారు.

వి.కోటలో ప్రచార రథం

వి.కోట: కాణిపాక వినాయకస్వామి ప్రచార రథం గురువారం పట్టణానికి చేరుకుంది. పలు గ్రామాల్లో ప్రచారం అనంతరం పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్దకు చేరిన ఈ రథంలో ప్రత్యేక పూజలు చేశారు. కాణిపాక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి నిర్వహించే పూజలు, అభిషేకాలు, దర్శన వివరాల సమాచారంతో ఉన్న కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తూ రథం సాగింది.



కళాకారిణి నృత్య ప్రదర్శన

కాణిపాకం బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనలిచ్చిన కళాకారులతో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు





పురవీధులలో విహరిస్తున్న దేవదేవేరులు

బ్రహ్మోత్సవం.. సాంస్కృతిక సౌరభం

కాణిపాకం(యదమరి): కాణిపాకంలోని స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలలో గురువారం సాంస్కృతిక సౌరభం వెల్లివిరిసింది. స్వామివారికి ఉదయం అభిషేకం నిర్వహించగా, సాయంత్రం సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి మూషిక వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి ఆస్థాన మండపంలో కళాకారులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కళాకారులకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి గుర్తింపు పత్రాలను అందించారు. ఉదయం కోదండరామ(జె.కొత్తూరు) ధార్మికోపన్యాసం, సుమతి (తిరుపతి) వారిచే హరికథ, కల్యాణ్‌కుమార్ (తిరుపతి) భక్తి గీతాలు, యం.సుజాత(అనంతపురం) వారిచే కూచిపూడి, గంగాధరం(కర్నూలు) వారిచే భరతనాట్యం, లక్ష్మీ(నెల్లూరు)వారిచే శ్రీరామంజనేయ యుద్ధం నాటిక, శివనాయక్ పెద్దబిడికి వారిచే లంబాడి నృత్యాలు నిర్వహించారు.

ఉత్సవ మూర్తుల ఊరేగింపు

ఆలయ అలంకార మండపంలో ఉదయం సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. పుర వీధుల్లో మేళతాళాలతో ఊరేగించగా భక్తులు స్వామి వారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాట్యం చేస్తున్న కళాకారిణి



కేరళ సంప్రదాయ నృత్య ప్రదర్శన



భరతనాట్యం చేస్తున్న చిన్నారులు



నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

గోవిందరాజుల గుట్టను అభివృద్ధి చేద్దాం



సమావేశంలో శ్రీవారి భక్తులు

చిత్తూరు రూరల్: గోవిందరాజుల గుట్టను అభివృద్ధి చేద్దామని శ్రీవారి భక్తులు పిలుపునిచ్చారు. చిత్తూరు మండలం టి.వేపనపల్లి సమీపంలో గోవిందరాజుల గుట్ట వద్ద గురువారం ఏడు పంచాయతీల గ్రామస్తులు సమావేశమయ్యారు. గ్రామానికి ముగ్గురు చొప్పున కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. శ్రీవాణి ట్రస్టు పేరుతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తామని, తర్వాత ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు సభ్యులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, సభ్యులు సోమనాథరెడ్డి, బాబు, మురళీధర్‌రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, బాబునాయుడు, దుర్వాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై గడ్డి కత్తిరింపు యంత్రాల పంపిణీ



పాడి రైతులకు చాప్‌కటర్స్‌ను అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య

గుడిపాల: పాడి రైతులకు రాయితీపై గడ్డి కత్తిరింపు యంత్రాల(చాప్‌కటర్ల)ను ప్రభుత్వం అందజేస్తున్నట్లు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ రమ్య అన్నారు. వసంతాపురం రైతు భరోసా కేంద్రం ఆవరణలో గురువారం సర్పంచ్ రజినీకాంత్ ఆధ్వర్యంలో 20 మంది పాడి రైతులకు చాప్‌కటర్స్‌ను వారు పంపిణీ చేశారు. మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని ఇందులో భాగంగా చాప్‌కటర్(గడ్డి కత్తరించే) యంత్రాలను ఇచ్చినట్లు చెప్పారు. ఒక్కో చాప్‌కటర్ విలువ రూ.33,970 ఉండగా ప్రభుత్వం రూ.20,382కు రైతులకు అందజేయనున్నారు. ఇందులో ప్రభుత్వం సబ్సిడీ రూ.13,588 ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రవితేజ, వెటర్నరీ అసిస్టెంట్ అబ్దుల్లా, సోషియల్ మీడియా కన్వీనర్ సాయిప్రతాప్, మాజీ సర్పంచ్ రెడ్డెప్ప, పాడి రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం కోసం సహకరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: పర్యావరణాన్ని రక్షిస్తూ, ప్రకృతి సహజమైన వస్తువులను ఎక్కువగా ఉపయోగించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా.అరుణ పిలుపునిచ్చారు. చిత్తూరులోని కట్టమంచి వివేకానంద విగ్రహం వద్ద మునిసిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి ఇండియా వర్సెస్ గార్బేజ్ అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కట్టమంచి చెరువు గణేష్ నిమజ్జన కేంద్రం వద్ద గార్బేజ్ ఫ్రీ సిటీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఇప్పటికే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా పార్కులను శుభ్ర పరచడం, 2 కే రన్, మొక్కలు నాటడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీరు గోమతి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, డిప్యూటీ ఇంజినీరు వెంకటప్రసాద్, రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సబ్ పోస్టుమాస్టర్ రాంకుమార్ సస్పెన్షన్

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు నగరం ఇరువారం సబ్‌పోస్టు మాస్టర్ రాంకుమార్‌ను సస్పెండ్ చేస్తూ తపాలాశాఖ సూపరింటెండెంట్ లక్ష్మన్న ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి ఆరోపణలు నేపథ్యంలో ఆయనపై చర్యలు తీసుకున్నమన్నారు. రాంకుమార్ ఇరువారం సబ్‌పోస్ట్ మాస్టర్‌గా పనిచేస్తున్న సమయంలో ఖాతాదారుల నగదును మాయం చేసిన ఘటనపై ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. దీంతో ఆయన్ను తాత్కాలికంగా స్థానిక మార్కెట్ పోస్టాఫీసుకు బదిలీ చేశామన్నారు. అనంతరం చేపట్టిన విచారణలో ఖాతాదారుల నగదును దుర్వినియోగం చేసినట్లు తేలిందని వివరించారు. అతని వద్ద నుంచి రూ.2 లక్షలు నగదును రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. సబ్‌పోస్టు ఆఫీసు పరిధిలోని పొదుపు ఖాతాలను తనిఖీ చేస్తున్నామని, నివేదికను కర్నూలులోని ప్రాంతీయ ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వెల్లడించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులను పంపిణీ చేస్తున్న నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని శిశువిహార్‌లో ఉంటున్న అనాథ పిల్లలకు విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు నిత్యావసర సరుకులు గురువారం పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేలు మాట్లాడుతూ ప్రతి ఏటా వినాయక చవితి పండుగను పురస్కరించుకుని తమ వంతు సాయంగా అనాథ పిల్లలకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కరుణాకర్ సిద్ధు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయండి

పూతలపట్టు: ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు కేటాయించిన లక్ష్యాలను పూర్తిచేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఫీల్డ్ అసిస్టెంట్లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ లక్ష్యాలను కూలీలతో మాట్లాడి వారిని వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు. తప్పకుండా ఏరోజుకారోజు పనితీరును ఎంబుక్‌లో నమోదు చేయాలని సూచించారు. జాబ్ కార్డులున్నవారు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఓ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ



స్వామివారి చిత్రపటం అందిస్తున్న చైర్మన్, ఈవో

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని తెలంగాణ ఆర్అండ్‌బి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస్ రాజు దర్శించుకున్నారు. ఆయన గురువారం కాణిపాకం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య



పాత్రికేయులకు ప్రతులు అందజేస్తున్న చిత్తూరు ప్రెస్‌క్లబ్ నాయకులు

చిత్తూరు రూరల్: జిల్లాలో పనిచేస్తున్న పాత్రికేయుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఉచిత విద్యను అందించడానికి నిర్వాహకులు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా కన్వీనర్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎం.లోకనాథన్, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి కెఎం.అశోక్‌కుమార్ కోరారు. వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఎలాంటి రుసుము లేకుండా ఉచిత విద్యను అందించాలంటూ కలెక్టర్ షణ్మోహన్ స్పందిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల ప్రతులను గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయులకు అందించారు. దీనిపై యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రైవేటు విద్యా సంస్థల నిర్వాహకులు ఆలోచించి పాత్రికేయుల పిల్లలకు ఉచిత విద్య అందించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు మహేష్, సంయుక్త కార్యదర్శి షకీల్, కోశాధికారి పవన్‌కుమార్ పలువురు సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవతో పేదలకు వైద్యసేవలు



బంగారుపాళెంలో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శిరీషా

బంగారుపాళెం: గ్రామీణ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ఆయుష్మాన్ భవ లక్ష్యమని బంగారుపాళెం సామాజిక ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీషా అన్నారు. ఆస్పత్రిలో గురువారం «ఆయుష్మాన్ భవ» కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. వివిధ జబ్బులతో ఆస్పత్రికి వచ్చే రోగులకు నిపుణులైన వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి వారం ఆస్పత్రిలో ఆయుష్మాన్ భవ ప్రత్యేక క్యాంప్‌ను చేపట్టి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామీణుల ఆరోగ్యానికి పెద్ద పీట వేశారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా పల్లెల్లో రోగుల చెంతకు సిబ్బంది వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయకుమారి, జశ్వంత్, ఏవి రాయల్, జ్యోతి, స్వరూప్, అఖిల్ భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేసిన ఉపాధ్యాయులు

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాల ఉపాధ్యాయులు తులసీ ప్రసాద్ ఉచితంగా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో క్రీడల్లో రాణిస్తున్నప్పటికీ వారికి క్రీడా దుస్తులు లేకపోవడంతో ఉపాధ్యాయలు తులసీ ప్రసాద్, తన సొంత నిధులు రూ.10వేలు వెచ్చించి, 45 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు విరాళంగా అందించినట్లు పాఠశాల హెచ్‌ఎం గిరిరాజకు వివరించారు. దీనిపై గురువారం సాయంత్రం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించారు.

రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం



సమావేశంలో మాట్లాడుతున్న రాజారత్నంరెడ్డి

పూతలపట్టు: ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పేదలకు 5 లక్షల వరకు ఉచిత వైద్యం అందజేస్తుందని కమ్యూనిటీ కో–చైర్మన్ రాజారత్నంరెడ్డి అన్నారు. ఆయన గురువారం మండలంలో పి.కొత్తకోటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్థానికులు అవగాహన కల్పించారు. రాజారత్నంరెడ్డి మాట్లాడుతూ ఆయుష్మాన్ హెల్త్ కార్డును ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శ్రీధర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు

చిత్తూరు కలెక్టరేట్: పరిపాలన సౌలభ్యం మేరకు ఏర్పాటైన చిత్తూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు పాత కలెక్టరేట్‌లో, జెడ్పీ పక్కన ఉన్న పాత జిల్లా పంచాయతీ కార్యాలయంలో నూతనంగా రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆర్డీవో కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ప్రతిపాదనలు పంపారు. ఉద్యోగోన్నతిపై జిల్లాకు విచ్చేసిన అరుణకుమారిని చిత్తూరు రూరల్ తహసీల్దార్‌గా, డిప్యూటీ తహసీల్దార్లుగా రమణి, అశోక్‌కుమార్‌ను నియమించారు. గురువారం నూతన తహసీల్దార్ అరుణకుమారి కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీవో రేణుకను కలిసి బాధ్యతలు స్వీకరించారు. నూతన కార్యాలయం ఏర్పాటయ్యే వరకు చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలోనే వారు విధులు నిర్వర్తించనున్నారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జనం



నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు

ఐరాల: నాలుగు రోజుల పాటు విశేష పూజలందుకున్న బొజ్జ గణపయ్య గురువారం గంగ ఒడికి చేరాడు. మండల కేంద్రంలోని వి.యస్.అగ్రహారం యువత ఆధ్వర్యంలో మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో గణనాథుడిని ఊరేగించారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువులో వినాయకుడి ప్రతిమను నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ముంగిట్లో వైద్యం



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత



తవణంపల్లె: ఎ.గొల్లపల్లెలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

యాదమరి: ఫ్యామిలీ డాక్టర్ సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి సురేఖ కోరారు. మండలంలోని కొనాపల్లె, పెరియంబాడి పంచాయతీ గ్రామాల్లో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లి వైద్య సేవలు అందించారు. అనంతరం వారికి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సూరి, విజయలక్ష్మి, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

తవణంపల్లె: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎ.గొల్లపల్లెలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 63 మంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, నేత్రి, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నాంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని నాంపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ పూర్ణలత 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆరోగ్య శ్రీ పథకం కింద శస్త్రచికిత్స చేసుకున్న రోగులకు సేవలందించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.